క్లుప్తంగా

ప్రారంభమైన వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో సోమవారం ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు స్వామి వారికి తిరుమంజన శత అష్టోత్తరంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. అనంతరం సుదర్శన కలశాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు అంగలూరి రంగాచార్యులు స్వామి వారి విశేషంగా పుష్పాలు, తులసీదళాలతో అర్చన నిర్వహించారు. అలాగే లోక కల్యాణార్థం లక్ష్మీ గణపతి హోమం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల అంగలూరి పద్మావతి పర్యవేక్షించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 26వ డివిజన్‌లో రూ. 39.88లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాసాంజనేయస్వామివారి దేవాలయం నుంచి పోతినేని వారి వీధి వరకు రూ.11.45లక్షలతో రోడ్డు ఎత్తు పెంచటానికి, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల నుంచి మైహోమ్ అపార్ట్‌మెంట్ వరకు రూ. 8.51లక్షల వ్యయంతో స్టామ్ వాటర్ డ్రైనేజీ పనులు, రూ.19.92 లక్షలతో కాటూరి వారి వీధిలో యూజీడీ పైపులైన్‌లు మార్చిడి పనులకు శంకుస్థాపన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వల్లభనేని సతీష్, నగరపాలక సంస్థ ఏఈ భవాని పాల్గొన్నారు.

ఇళయరాజా సంగీత సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీత సేవలు వెలకట్టలేనివని విశ్రాంత పోలీస్ అధికారి కె. డేవిడ్‌రాజు అన్నారు. హ్యాపీ మూమెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై సోమవారం సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా జన్మదిన వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ ఇళయరాజా భారతీయ భాషల్లో వచ్చిన అనేక చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించినట్లు తెలిపారు. సీనియర్ గాయని చందన మాట్లాడుతూ ఇళయరాజా స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, పరుచూరి విజయలక్ష్మి, బీవీ వీరభద్రరావు, ప్రసూనా రామన్, మారేపల్లి జోషి పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతకు ఈ నెల 5వ తేదీ నుంచి తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ స్వయం ఉపాధి కోర్సులో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ సోమవారం తెలిపారు. కట్టింగ్ అండ్ టైలరింగ్, డ్రెస్ మేకింగ్, జ్యూట్ క్రాఫ్ట్స్, ప్రొడక్ట్ మేకర్ అసిస్టెంట్, బ్యూటీ కేర్ అసిస్టెంట్, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ రిఫ్రిజిరేషన్, హోమ్ క్రాఫ్ట్స్, స్క్రీన్ ప్రింటింగ్, బాతిక్ ప్రింటింగ్, ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ ప్రాసెసింగ్ అసిస్టెంట్, జామ్ అండ్ జ్యూస్ మేకింగ్, అసిస్టెంట్ డ్రెస్ మేకర్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ అసిస్టెంట్, ఫ్యాషన్ జ్యూవెలరీ మేకింగ్, మిర్రర్ వర్క్ మొదలైన కోర్సుల్లో శిక్షణ అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు 0866-2470420లో సంప్రదించాలని కోరారు.

అధ్వానం.. అస్తవ్యస్తం

- రూపు కోల్పోయిన నందమూరినగర్
- చెత్త, చెదారాలతో దర్శనమిస్తున్న తోటవారి వీధులు
- అడుగడుగునా యూజీడీ లీకులు



తోటవారివీధి ఆరంభంలో చెత్తను కిందకు పడేసి రోడ్డంతా లాగేస్తున్న వీధికుక్కలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నందమూరినగర్.. ఒకప్పుడు ఈ పేరు చెబితే ఆహ్లాదాన్ని పంచే పచ్చని వాతావరణం కళ్ల ముందు కనువిందు చేసేది.. మనకు ఇల్లంటూ ఉంటే ఇలాంటి ప్రాంతాల్లో ఉండాలనిపించేలా పెద్ద పెద్ద రోడ్లు.. చుట్టూ పచ్చని చెట్లతో మనసుకు ప్రశాంతతను కలిగించేవి.. కానీ ఇప్పుడా ప్రాంతాలు కళావిహీనంగా దర్శనమిస్తూ స్థానిక ప్రజలను కలవరానికి గురి చేస్తున్నాయి.

బుడమేరు వరదలతో..

స్థానిక 58వ డివిజన్ పరిధిలోని తోటవారి వీధిలో దాదాపు 14 రోడ్ల వరకూ ఉన్నాయి. ఈ వీధికి ఇరువైపులా ఉన్న ఈ లైన్లలో రెండు వేలకు పైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్‌లు, గ్రూప్‌హౌస్‌లు, భవనాలతో నిండిపోయి ఉంటాయి. ఈ ప్రాంతాలలో అడుగుపెట్టిన వారిని ఇక్కడి పరిస్థితులు ఆహా అనిపించేలా కాసేపు సేద తీరేలా చేసేవి. అయితే గత ఏడాది వచ్చిన బుడమేరు వరదల ప్రభావంతో ఇక్కడి పరిస్థితులన్నీ ఒక్కసారిగా తారుమారైపోయాయి. ఈ ప్రాంతం పేరు వింటేనే ఇక్కడి స్థానిక ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు కూడా హడలిపోతున్నారు. వరదలు వచ్చి వెళ్లి ఇన్ని నెలలు గడుస్తున్నా ఇక్కడి పరిస్థితులు మాత్రం ఇంకా చక్కబడకపోవడమే దీనికి కారణంగా కనిపిస్తున్నాయి.

పేరుకుపోతున్న చెత్త..

తోటవారి వీధి, సిద్ధార్థ నగర్ ప్రాంతాలలో నడిరోడ్లే చెత్త కుండీలుగా దర్శనమిస్తున్నాయి. తోటవారి వీధి ఆరంభంలో, ఐదో లైను, తొమ్మిదో లైను, పదకొండో లైన్‌లలో స్థానికులు రోడ్డుపైనే చెత్తవేసి వెళ్తున్నారు. దీంతో వీధికుక్కలు చేరి వాటిని ఇష్టం వచ్చినట్లుగా రోడ్డంతా చేస్తున్నాయి. వీటితో పాటు దోమలు, ఈగలకు కూడా అవి ఆవాసాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ ఉన్నతాధికారులు తమ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించి ఇక్కడ డస్ట్‌బిన్‌లు ఏర్పాటుచేసి, రోడ్లపై చెత్త సమస్యలు లేకుండా పరిష్కార చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



తోటవారి వీధి ఎనిమిదో లైన్‌లో లీక్ అవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

ఇళ్ల ముందు మురుగు..



విశాల్ మార్ట్ వెనుక వర్షపునీటితో నిండిన రోడ్డు

నందమూరినగర్, తోటవారి వీధి, భారతమాత మందిరం రోడ్డు, సిద్ధార్థ నగర్ పరిసర ప్రాంతాలలో యూజీడీ మ్యాన్‌హోల్స్ నుంచి ఎక్కువ శాతం లీకులు ఏర్పడి ఆ మురుగంతా ఇళ్ల ముందు రోడ్లపై ప్రవహిస్తోంది. సమస్యలను సంబంధిత సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నమ్మి ఓట్లేస్తే నిలువునా ముంచారు

- వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేద్దాం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లాది విష్ణు పిలుపు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తమకు మరింత మంచి చేస్తారనే నమ్మకంతో ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే.. కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలు, చంద్రబాబు చేస్తున్న మోసాలు, అరాచకాలు, అన్యాయాలకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన 'వెన్నుపోటు దినం' నిర్వహిస్తున్నామన్నారు. ఈ నిరసన కార్యక్రమం వాల్‌పోస్టర్‌లను డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జూన్ 4వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద వెన్నుపోటు దినం కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. ధర్నాచౌక్ నుంచి గాంధీనగర్‌లోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అక్కడ వినతిపత్రం అందజేస్తామని వివరించారు.

అంతా అవినీతిమయం..

చంద్రబాబు పాలనలో అంతా అవినీతి, దోపిడీలేనని.. కరెంటు బిల్లులు పెంచడం ద్వారా రూ.1500 కోట్లు భారం ప్రజలపై పడిందని.. ఒక్క సెంట్రల్ నియోజకవర్గంలోనే 150–170 కోట్ల రూపాయలు కరెంటు బిల్లుల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని మల్లాది ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు రాష్ట్రంలో పూర్తిగా ఫెయిల్ అయ్యాయని దుయ్యబట్టారు. ప్రజలకు ఉపయోగపడే సచివాలయాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని.. ఏ హాస్పిటల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో లేవని దానికి కారణం చంద్రబాబు దుర్మార్గపు రాజకీయాలేనన్నారు. ఇంటింటికీ రేషన్ ఇచ్చే పద్ధతిని కూడా ఆపేసి నిరుపేదలను మళ్లీ రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాసేలా చేస్తున్నారన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ ఏరియా పేరుతో భూమి దోచేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షాహినా సుల్తానా, కొండాయిగుంట మల్లేశ్వరి, కుక్కల అనిత, శర్వాణి మూర్తి, అలంపూరు విజయ్, గుండె సుందర్ పాల్, త్రివేణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, చిత్రంలో డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్లు

రోడ్లపై వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు

అధికారులకు వీఎంసీ కమిషనర్ ఆదేశం

పటమట(విజయవాడతూర్పు): నగరంలో రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం వన్‌టౌన్ కృష్ణవేణి క్లాత్ మార్కెట్, అవుట్‌ఫాల్ డ్రైన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అవుట్‌ఫాల్ డ్రైన్లలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, డీసిల్టింగ్ ప్రక్రియను నిరంతరం చేయాలని, వర్షపు నీరు రోడ్డుపైన నిలవకుండా ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేఖ, డెప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వన్‌టౌన్ అవుట్‌ఫాల్ డ్రైన్ పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలి



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులు పరిష్కారం చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సర్కిల్-1 కార్యాలయంతో పాటు వీఎంసీ ప్రధాన కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గత వారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నివేదికలో అధికారులు పరిష్కరించిన దరఖాస్తులను వీక్షించారు. ప్రతి సమస్యకి సరైన పరిష్కారం అందించాలని, ప్రజలకు సంతృప్తికరమైన, శాశ్వతమైన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం సమస్యలను తెలియపరిచే పురం, ఇతర యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను కూడా పరిష్కరించాలని, ఇప్పటివరకు పురమిత్రలో నమోదైన సమస్యలను పరిశీలించి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. చిట్టినగర్ సర్కిల్-1 కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆరు ఫిర్యాదులు రాగా ప్రధానంగా ఇంజినీరింగ్ సంబంధిత సమస్యలు, ఇల్లు కేటాయింపు ఫిర్యాదులను స్వీకరించారు. ప్రధాన కార్యాలయంలో 11 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళికకు సంబంధించినవి 3, ఇంజినీరింగ్ 3, రెవెన్యూ సంబంధించినవి 2, వైద్య – ఆరోగ్యంపై 2 ఉన్నాయి. సర్కిల్ 1 కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో డెప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేఖ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్‌వైజర్ శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు సత్కారం



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పలువురు అధికారులు, సిబ్బందిని సోమవారం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఘనంగా సన్మానించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో గంటా మేరీ ప్రశాంతి (సూపరింటెండెంట్ – ఎస్టేట్ విభాగం), రెబగొండ్ల ఓబేశ్వరరావు (శానిటరీ సూపర్వైజర్ – ప్రజారోగ్యం విభాగం), పీవీఎస్‌పీఆర్ శర్మ (జేటీఓ – ఇంజినీరింగ్ విభాగం), ఎ.ధనలక్ష్మి (ఆఫీస్ సబార్డినేట్ – అకౌంట్స్ విభాగం), జేవీ శ్రీనివాస్ (ఎస్టేట్ విభాగం)లను సత్కరించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఆలపాటిపై చర్యలు తీసుకోవాలి

కమ్యూనిస్టు పార్టీల డిమాండ్



మాట్లాడుతున్న దోనేపూడి కాశీనాథ్, కోటేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు డిమాండ్ చేశాయి. సోమవారం విజయవాడ గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ శాతవాహన కళాశాలకు సంబంధించిన కేసు కోర్టు పరిధిలో వివాదం నడుస్తోందన్నారు. ఈ సమయంలో బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సభ్య సమాజం తలదించుకునే చర్యకు పాల్పడ్డారన్నారు. దీనికి కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ. వందల కోట్ల విలువ చేసే శాతవాహన కళాశాల సొసైటీ భూమిని కబ్జా చేసేందుకు స్వయంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజా రంగంలోకి దిగి తన అనుచరుల ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును కిడ్నాప్ చేయించారని మండిపడ్డారు. కళాశాల వ్యవహారం కోర్టులో నడుస్తుండగానే ప్రిన్సిపాల్ కిడ్నాప్ కోర్టుధిక్కరణ కిందకు వస్తుందన్నారు. 'మేం అధికారంలో ఉన్నాం.. మేం ఏది చెప్తే అది నువ్వు చేయాలి.. మేమనుకున్నది జరగాలి, మాకు అనుకూలంగా కళాశాలకు సంబంధించిన ఫైల్‌పై సంతకం చేయాలి, లేకపోతే చంపుతాం' అనే ధోరణిలో ఆలపాటి చేసిన వ్యాఖ్యలను బాధిత ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మీడియా సాక్షిగా వెల్లడిచేశారంటే.. ప్రభుత్వాన్ని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని, ఎమ్మెల్సీ ఏ స్థాయిలో బరితెగించారో అర్థం చేసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం, సీపీఐ నాయకులు భూపతి రమణారావు, పి. కృష్ణ, లంకా దుర్గారావు, ఎస్. వీరభద్రరావు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న నిరుపేద బాలుడికి వాసవి క్లబ్ అజిత్‌సింగ్‌నగర్ సభ్యులు ఆర్థిక సహాయం చేశారు. సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన కట్టమూరి నాగచైతన్య(14) ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ కారణంగా ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బాలుడి కుటుంబ సభ్యుల దీనావస్థను గుర్తించిన వాసవి క్లబ్ సభ్యులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు కేవీ భాస్కరరావు, జెడ్‌సీ సురేష్, సభ్యులు సోమవారం బాలుడి నివాసానికి వెళ్లి నగదును అందించారు.

అన్నపూర్ణ థియేటర్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ గవర్నర్‌పేటలోని అన్నపూర్ణ థియేటర్‌పై సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. వాచ్‌మెన్‌పై దౌర్జన్యం చేసి అతని వద్ద సెల్ ఫోన్ లాక్కున్నారు. పొక్లయినర్‌తో వచ్చి గేటు పగులగొట్టి లోపలకు ప్రవేశించి థియేటర్ ముందు భాగాన్ని ధ్వంసం చేశారు. మెట్ల మార్గాన్ని కూల్చివేశారు. టికెట్ కౌంటర్, క్యాంటీన్, ఆఫీస్ రూం, వాష్ రూమ్స్, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. కరెంట్ లైన్ కట్ చేశారు. దీనిపై థియేటర్‌ను మేనేజ్ చేస్తున్న అడుసుమిల్లి శ్రీరామ్ గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలు పరిశీలించి దాడికి పాల్పడిన వారిని గుర్తించాలని ఫిర్యాదులో కోరారు. సీపీకి కూడా రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేసినట్లు శ్రీరామ్ తెలిపారు. దీనిపై కేసు నమోదు కాలేదు. కాగా థియేటర్ యాజమాన్యం కుటుంబ కలహాల నేపథ్యంలోనే దాడి జరిగినట్లు సమాచారం.

లారీ ఢీకొని ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు గాయాలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): స్కూటీపై వస్తున్న ఎన్టీటీపీఎస్ ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌ను లారీ ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. గుంటుపల్లి వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఈ ఘటన జరిగింది. శ్రీనివాసరావు విజయవాడ నుంచి ఇబ్రహీంపట్నం వస్తున్న క్రమంలో గుంటుపల్లి వద్ద వెనుక వైపు నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన గాలికి గాయం కాగా స్థానికులు వైద్యశాలకు తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికలోని ఓ ప్రైవేటు సంస్థలో ప్యాకింగ్ పని చేసే కనపర్తి శ్యామ్(18)అనే యువకుడు ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటనపై నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కనపర్తి శ్యామ్ కండ్రికలోని ఓ ప్రైవేటు సంస్థలో ప్యాకింగ్ పని చేస్తున్నాడు. శ్యామ్ రెండు నెలల క్రితం ఆ సంస్థలో ప్యాకింగ్ వర్కర్‌గా చేరాడు. ఆదివారం సంస్థ ఎగ్జిక్యూటివ్ మల్లేశ్వరి శ్యామ్‌ను పనికిరావద్దని మందలించినట్లు మృతుడు తండ్రికి ఫోను చేసి చెప్పాడు. సోమవారం మధ్యాహ్నం శ్యామ్ కండ్రికలో అద్దెకు ఉంటున్న ఇంట్లో ఇనుపరాడ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి కనపర్తి వెంకటరత్నం సంస్థ ఎగ్జిక్యూటివ్ మల్లేశ్వరి పనికి రావద్దని చెప్పినందున మనస్తాపం చెంది తన కుమారుడు ఉరివేసుకున్నాడని నున్న పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వాణిజ్య లైంగిక బాధిత మహిళల హక్కులు కాపాడండి



సమావేశంలో మాట్లాడుతున్న విముక్తి రాష్ట్ర అధ్యక్షురాలు అపూర్వ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వేశ్యా వృత్తిలో మగ్గుతున్న సుమారు లక్ష 33వేల మంది వాణిజ్య లైంగిక బాధితుల(సెక్స్ వర్కర్స్), మానవ అక్రమ రవాణా బాధిత మహిళల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కృషి చేయాలని రాష్ట్ర అక్రమ రవాణా బాధిత మహిళలు, వాణిజ్య లైంగిక బాధితుల సమాఖ్య (విముక్తి) రాష్ట్ర అధ్యక్షురాలు అపూర్వ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ ఆధారిత పునరావాస కార్యక్రమాలతో పాటు చట్ట ప్రకారం అందాల్సిన నష్ట పరిహారాలు, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అంతర్జాతీయ వాణిజ్య లైంగిక బాధితుల (సెక్స్ వర్కర్స్) హక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం రాణిగారితోటలోని కమ్యూనిటీ భవన్‌లో రాష్ట్ర స్థాయి అక్రమ రవాణా బాధిత మహిళలు, వాణిజ్య లైంగిక బాధితుల సమాఖ్య (విముక్తి) లీడర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అపూర్వ మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ 2021–22 వార్షిక నివేదిక ప్రకారం దేశంలో అత్యధికంగా వేశ్యావృత్తిలోని మహిళల సంఖ్య రాష్ట్రంలోనే ఎక్కువగా ఉందని, దాదాపు 2.25 లక్షల మంది కుటుంబ సభ్యులు ఈ మహిళలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వీరేకాక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే సెక్స్ వర్కర్స్‌ను కలిపితే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. వీరంతా ప్రభుత్వ సంరక్షణ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరికీ షెల్టర్ హోమ్ ఆధారిత పునరావాసం రద్దు చేసి కమ్యూనిటీ ఆధారిత పునరావాస విధానాన్ని అమలు చేయాలని, అక్రమ రవాణా బాధిత మహిళలు, సెక్స్ వర్కర్స్‌తో కూడిన స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి వారికి తక్కువ వడ్డీతో రుణాలు అందించాలని, ప్రత్యేక కేటగిరీలో ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెల్ప్ కార్యదర్శి నిమ్మరాజు రామమోహన్, ప్రాజెక్ట్ మేనేజర్ భాస్కర్ పాల్గొన్నారు.